
సాక్షి ఒడిశా

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,73,494లు, బంగారం 1గ్రాము 700 మిల్లీగ్రాములు వెండి 170 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సిమిలిపాల్‌లో హిమపాతం

సిమిలిపాల్‌లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

- 8లో



ఘనంగా ఉత్సవాలు

మాల్యవంత్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కళాకారుల ప్రతిభ ఆకట్టుకుంది.

- 8లో

కొరత గట్టెక్కేనా..?

- స్వీయ వనరుల కోసం కసరత్తు
- బంగాళాదుంపల కోసం తప్పని యాతన



భువనేశ్వర్: రాష్ట్రం తరచూ బంగాళాదుంపల కొరతతో తల్లడిల్లుతోంది. వినియోగానికి తగినంత ఉత్పాదన లేకపోవడమే ప్రధాన కారణం. మరో వైపు ఈ పంట మిగులుతో తులతూగే పొరుగు పశ్చిమ బెంగాల్‌తో తరచూ వివాదం నెలకొనడంతో బంగాళా దుంపల దిగుమతిపై అది ప్రభావం చూపుతోంది. పశ్చిమ బెంగాలు రవాణా నిలిపివేస్తే రాష్ట్రంలో కృత్రిమ కొరత తలెత్తుతోంది. ఆలు గడ్డల ధరల చుక్కల్ని తాకుతున్నాయి. ఈ విపత్తు నుంచి బయటపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ యోచిస్తోంది. బంగాళాదుంపల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోంది.

బంగాళా దుంప సాగుకు సాయం

రాష్ట్రంలో బంగాళా దుంపల సాగుని ప్రోత్సహించి వినియోగానికి అనుకూలంగా ఉత్పాదన సాధించాలనే దృక్పథంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ కృషి చేస్తోంది. రాష్ట్రంలో 15 వేల హెక్టార్లకు పైగా భూమిలో బంగాళా దుంపల వ్యవసాయాన్ని విస్తరించడం విభాగం లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ, రైతు సాధికారిత విభాగం మంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ తెలిపారు. తరచూ పొరుగు పశ్చిమ బెంగాలు అలక తీర్చడం కంటే స్వీయ వనరులతో సాధికారిత బలపరచుకోవడం శ్రేయోదాయకమని విభాగం సంకల్పించింది. ఈ నేపథ్యంలో 15,023 హెక్టార్ల భూమిలో బంగాళా దుంపల సాగుకు వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. 2023–24 సీజనులో 13.8 లక్షల మెట్రిక్ టన్నుల బంగాళా దుంప ఉత్పత్తిని విభాగం లక్ష్యంగా నిర్ధారించింది. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టారు. అయితే ఈ సీజన్‌లోనే ఉత్పత్తిని మరింత పెంచేందుకు భారీగా సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కటక్, కంధమల్, కెంజొహర్, సుందర్‌గఢ్, కొరాపుట్ జిల్లాలు బంగాళా దుంపలను ఎక్కువగా పండించే జిల్లాలు. ఈ జిల్లాల్లో బంగాళా దుంపల ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. కొరాపుట్, రాయగడ, కంధమాల్ వంటి జిల్లాల్లో బంగాళా దుంపలు ఖరీఫ్ సీజను సాగు. రాష్ట్ర ప్రభుత్వం రబీ సీజన్‌లో బంగాళాదుంపల సాగు కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందడుగు వేయనుంది. దీని కోసం రూ. 64.17 కోట్లు వ్యయ ప్రణాళికని వ్యవసాయ ఖరారు చేసింది. ఏడాది పొడవునా రాష్ట్ర ప్రజలకు బంగాళా దుంపల్ని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేందుకు తాజా వ్యూహాత్మక కార్యాచరణ దోహదపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. బంగాళా దుంపల కొరత నివారణకు రాష్ట్ర వ్యాప్తంగా శీతల గిడ్డంగులు ఏర్పాటుచేయడంపై చర్యలు తీసుకుంటున్నారు. అంచనా మేరకు వ్యూహం ఫలప్రదం అయితే పశ్చిమ బెంగాల్ ఆగడాలతో అకస్మాతుగా తరచు తలెత్తుతున్న బంగాళా దుంపల కొరతకు తెర పడుతుందని మంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఇలాంటి పరిస్థితి తలెత్తింది. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో పొరుగు పశ్చిమ బెంగాలు ప్రభుత్వంతో మంతనాలు జరిపి బంగాళా దుంపల దిగుమతి పునరుద్ధరిచండంతో మెల్లగా సంక్షోభం గట్టెక్కి మార్కెటులో హోల్ సేల్, రిటైలు ధరలు దిగుముఖం పడుతున్నాయి.

స్వయం సమృద్ధి సన్నాహాలు

బంగాళా దుంపల సాగు కోసం రైతులకు సకాలంలో విత్తనాలు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణ ప్రచారంలో ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. సకాలంలో రైతాంగానికి నాణ్యమైన ఆలు గడ్డల విత్తనాల్ని సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాల సమాచారం.

అవిభక్త కొరాపుట్ ప్రగతికి కట్టుబడి ఉన్నాం: సీఎం



శ్రీజగన్నాథునికి పూజ చేసి ఆస్పత్రి భవనాలు ప్రారంభించిన ముఖ్యమంత్రి తదితరులు



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ మఝి

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని సీఎం మోహన్ చరణ్ మాఝి అన్నారు. ఆయన ఆదివారం జయపురం ఫూల్‌బెడలో 300 పడకల జిల్లా కేంద్రాస్పత్రి, సిబ్బంది క్వార్టర్లను ప్రారంభించారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. ఇది వీర భూమి అని సహీద్ లక్ష్మణ్ నాయిక్ లాంటి స్వాతంత్ర్య యోధులు ఇక్కడ పుట్టారని తెలిపారు. జిల్లాలో రూ.575 కోట్లతో 34 రకాల అభివృద్ధి పథకాలు చేపట్టనున్నామని తెలిపారు. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం సౌకర్యాల కల్పన, రోడ్లు, వంతెనల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. జయపురంలో చారిత్రక జగన్నాథ సాగర్ అభివృద్ధికి తాము హామీ ఇస్తున్నామన్నారు. ఇక్కడి ఉద్యోగాలు ఇక్కడి వారికే ఇస్తామన్నారు. నవరంగపూర్ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జునాగుడ నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు రైలు మార్గం వేస్తామన్నారు. కార్యక్రమంలో జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝి కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మ, సీడీఎంఓ హాస్పిటల్ అధికారులు, పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జయపురం వచ్చిన సమయంలో రోడ్ షో నిర్వహించారు.



ముఖ్యమంత్రి రోడ్‌షోలో పోటెత్తిన ప్రజలు

న్యూస్‌రీల్

ఉన్ని వస్త్రాల దుకాణం దగ్ధం



మంటల్లో దగ్ధమైన ఉన్ని వస్త్రాల దుకాణం

భువనేశ్వర్: జాజ్‌పూర్ ప్రాంతంలో ఉన్ని వస్త్రాల దుకాణం మంటల్లో దగ్ధమైంది. దుకాణంలో దుస్తులు ఇతరేతర ఆస్తులు మినహా ప్రాణహాని లేదు. జాజ్‌పూర్ మిశ్రీ లాల్ పెట్రోల్ బంకు సమీపంలోని ఉన్ని వస్త్రాల దుకాణంలో ఆకస్మికంగా ఈ ప్రమాదం సంభవించింది. అగ్ని మాపక దళం ఘటనా స్థలం చేరి మంటలు నివారించింది.

మల్కన్‌గిరిలో ఉపముఖ్యమంత్రి పర్యటన



బలిమెల జల విద్యుత్ కేంద్రంలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ ఆదివారం బలిమెల జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అక్కడ సిబ్బందితో చర్చించారు. మేనేజర్ తెలిపిన వివరాల మేరకు ఇక్కడి నుంచి ప్రస్తుతం 510 మెగా వాట్ల విద్యుత్ సరఫరా అవుతోందని తెలిపారు. సీలేరు నుంచి నీరు వస్తుందన్నారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇకపై ఇక్కడ అధిక మొత్తంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. అనంతరం బలిమెల సరస్వతి శిశు మందిరంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, నవరంగ్‌పూర్ ఎంపీ బోలభద్ర మాఝి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖిలో తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాల్యవంత్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

పులి చర్మాలు స్వాధీనం



పులి చర్మాలతో నిందితుడు

రాయగడ: రెండు పులి చర్మాలను విక్రయిస్తున్న సమయంలో అటవీ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అతడిని జిమిడిపేట సమీపంలో గల ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన రెడ్డి కౌసల్యగా గుర్తించారు. నిందితుడిని అధికారులు కోర్టుకు తరలించారు. పులి చర్మాల విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో అటవీ శాఖ డీఎఫ్ (విజిలెన్స్ విభాగం) రజని కుమార్ మహంతి నేతృత్వంలో 8 మంది అటవీ సిబ్బంది బృందంతో పాటు స్థానిక రాయగడ రేంజ్ పరిధిలో గల మరో ఆరుగురు అటవీ సిబ్బంది సంయుక్తంగా ఈ దాడులను పట్టణంలో గల ఒక ప్రముఖ లాడ్జిలో నిర్వహించారు. ఈ దాడుల్లో నిందితుడు కౌసల్యను అరెస్టు చేయడంతో పాటు పాటు రెండు పులి చర్మాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవాభావంతో ముందుకు కొనసాగాలి



హాజరైన ట్రస్టు ప్రతినిధులు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

రాయగడ: సమాజ హితం కోసం ఏర్పడే సేవా సంస్థలు సేవా భావంతో ముందుకు కొనసాగాలని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షురాలు సర్మిష్టా పాఢి అన్నారు. స్థానిక సాయిప్రియనగర్‌లోని సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్టు 12వ వార్షికోత్సవం ట్రస్టు కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పాఢి మాట్లాడుతూ.. సేవా దృక్పథంతో ఏర్పాటైన ఇటువంటి సంస్థల ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతోందన్నారు. ట్రస్టు కార్యదర్శి దయానిధి ఖడంగా మాట్లాడుతూ.. సాయిప్రియ నగర్‌లోని వివిధ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించామని అన్నారు. ట్రస్టు ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. కొత్త సంవత్సరంలో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అంతకు ముందు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి . అలాగే వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సమాజ సేవకురాలు సంధ్యారాణి దొలాయ, ట్రస్ట్ సభ్యులు లాడి మురళి స్వప్నా కుమారి రథో పాల్గొన్నారు.

510 కేజీల గంజాయి స్వాధీనం

- ఆంధ్రా నుంచి ఒడిశాకు కారులో తరలింపు
- ఒకరు అరెస్ట్, మరొకరు పరారీ



కారులో పట్టుబడిన గంజాయి సంచులు



అరెస్టు అయిన నిందితుడు రాజు

జయపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముచింగ్‌పుట్ ప్రాంతం నుంచి కారులో ఒడిశా రాష్ట్ర కొరాపుట్ జిల్లా జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ దిశగా తరలిస్తున్న గంజాయిని జయపురం సదర్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం విజయవాడ–రాంచీ 326 జాతీయ కారిడార్‌లో జయపురం సమితి పాత్రోపుట్ కూడలి వద్ద పట్టుకున్నట్లు సదర్ పోలీస్ అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. సదర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్స్పెక్టర్ పి.ఎస్.శతపతి నేతృత్వంలో పోలీసులు పెట్రోలింగ్, వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో రోడ్డు పక్కనే డేమేజ్ అయిన కారుని నిలిపించారు. ఈ కారుని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సమక్షంలో తనిఖీ చేయగా అందులో 21 సంచులలో గంజాయి బయటపడిందన్నారు. మెజిస్ట్రేట్ సమక్షంలో తూయగా 510 కేజీల 700 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. గంజాయి తీసుకువస్తున్న కారు రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ఒక కలప లోడు ట్రక్కను ఢీకొనటంతో డేమేజ్ అయిందని పోలీస్ అధికారి వెల్లడించారు. ఈ సంఘటనలో ఆంధ్రప్రదేశ్ వాసి కొర రాజు(24)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు పరారీ అయ్యాడన్నారు. నిందితుడు రాజుపై కేసు నమోదు చేసి, కారుని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

బస్సు బోల్తా: ఒకరు దుర్మరణం



అదుపు తప్పి బోల్తా పడిన బస్సు



ఘటనా స్థలంలో గుమిగూడిన జనం

భువనేశ్వర్: భద్రక్ జిల్లాలో బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రహదారి పక్కన నిలబడి ఉన్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. బస్సులోని 10 మంది పైబడి ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో సుమారు 7 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రక్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. స్థానికులు చొరవ కల్పించుకుని మిగిలిన ప్రయాణికుల్ని స్థానిక ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందజేస్తున్నారు. ఈ విషాద సంఘటన భద్రక్ జిల్లా జగులిపాదా గ్రామం సమీపంలో ఆదివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో జరిగింది. బొంతా థాణా పోలీసులు ఘటనా స్థలం చేరి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అతి వేగం ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షుల ఆరోపిస్తున్నారు. భద్రక్ నుంచి బొంతా వైపు అతి వేగంగా దూసుకు పోతున్న బస్సు అదుపు తప్పి ప్రయాణికులతో బోల్తా పడింది. రోడ్డు పక్కన నిలబడి ఉన్న అమాయకుని ప్రాణాల్ని బలిగొంది.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

- టికిరి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం



ఆటో వద్ద పడి ఉన్న ఖొర మృతదేహం



కుటుంబ సభ్యులతో ఖొర (ఫైల్)

రాయగడ: ఆటో డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఆటోను మాట్లాడుకొని తీసుకొని వెళ్లిన వ్యక్తులు కొంత దూరం వెళ్లాక తన వద్ద గల పదునైన ఆయుధంతో గొంతుకొసి హత్య చేశారు. ఈ ఘోర ఉదంతం రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్ స్టేషన్ పరిధి కంసారిగుడ కూడలిలో ఆదివారం మధ్యాహ్నం వెలుగు చూసింది. మృతుడుని దొరాగుడ గ్రామానికి చెందిన బలరాం ఖొరగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి, టికిరి ఏఎస్సై మనోజ్ జెన్న, మహేశ్వర్ పలక, కాసీపూర్ ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్ తదితరులు క్లూస్ టీంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరాపుట్ జిల్లా బంధుగాం సమితి గారిడి గ్రామానికి చెందిన ఖొర కొంత కాలంగా తన కుటుంబంతో సహా దొరాగుడ గ్రామంలోని ఆర్ఆర్ కాలనీలో నివస్తుండేవాడు. ఈనెల 11వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఆటోను పులోజోబ గ్రామం వరకు వెళ్లేందుకు బేరం కుదుర్చుకొని వెళ్లారు. ఈ క్రమంలో ఆటోలో ఉన్న దుండగుడు పదునైన అస్త్రంతో గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. అసలు హత్యకు కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. పాత కక్షలు కారణంగా ఈ దారుణం జరిగిందా లేక ఇతరత్రా కారణాలు ఏమైన ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు.

మో బస్సులో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన మో బస్సు



దగ్ధమైన మో బస్సులో నిజనిర్ధారణ కమిటీ పరిశీలన

భువనేశ్వర్: కటక్ నగరం ఖపూరియా స్క్వేర్‌లో మో బస్సు మంటల్లో చిక్కుకుంది. రాజధాని ప్రాంత నగర ట్రాన్స్‌పోర్ట్ ఈ ఘటనపై వాస్తవాల్ని నిర్ధారించేందుకు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ వేసింది. ఈ కమిటీ దర్యాప్తు చేసి సమగ్ర నివేదిక దాఖలు చేస్తుంది. ఈ దర్యాప్తు బృందంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, క్రట్ ఆపరేషన్స్, డిపో మేనేజర్, బస్సు ఆపరేటరుని సభ్యులుగా నియమించారు. క్రట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల నాయక్, సంజయ్ బిస్వాల్ సహా ఇతర అధికారులు ఘటనా స్థలం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. రాజధాని భువనేశ్వర్ నుంచి సిల్వర్ సిటీ కటక్ వెళ్తుండగా ఖపూరియా స్క్వేర్ వద్ద మో బస్సు మంటల్లో చిక్కుకుంది. ఈ ప్రమాదంలో బస్సు దగ్ధమైంది. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. జన సందోహిత ఖపూరియా–మధుపట్నా కూడలి ప్రాంతంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో ఈ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాద సమయంలో బస్సులో యాత్రికులు లేనందున ఘోర ప్రమాదం తప్పిందని విచారణ బృందం అభిప్రాయపడింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం తొలుత బస్సు ఇంజిన్ నుంచి రగిలిన మంటలు కాసేపట్లో బస్సు అంతా విస్తరించాయి. స్థానికుల సమాచారంతో అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరి మంటలు నివారించింది.

అంగరంగ వైభవంగా కొరాపుట్ పరబ్

రాష్ట్రస్థాయి కొరాపుట్ గిరిజన సాంస్కృతిక సంబరాలు పరబ్–2024 వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సీఎం మోహన్ చరణ్ మఝి ముఖ్య అతిథి హోదాలో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని పరబ్ మైదానంలో వేడుకలు ప్రారంభించారు. ఈ ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. తమను ఆదరించిన ప్రజల రుణం తీర్చుకుంటామని తెలిపారు.

కొరాపుట్



పరబ్‌కి హాజరైన వేలాది మంది ప్రజలు



గిరిజన కళాకారులు అందించిన కొరాపుట్ గిరిజనుల టోపీతో సీఎం మోహన్, పక్కనే జయపూర్ ఎమ్మెల్యే బాహిణీపతి



ధాన్యంతో చేసిన కళాఖండాలతో కళాకారులు



పరబ్ మైదానం లో బాలలకు ఆటోగ్రాఫ్ ఇస్తున్న సీఎం మోహన్ చరణ్

ఘనంగా ముగిసిన శ్రీ నృత్యోత్సవం



కళాకారులకు అతిథుల సత్కారం



శ్రీ నృత్యోత్సవంలో అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

భువనేశ్వర్: స్థానిక రవీంద్ర మండపంలో శ్రీ డ్యాన్స్ అకాడమీ నిర్వహించిన శ్రీ నృత్యోత్సవం–2024 ఆదివారంతో ముగిసింది. ప్రముఖ కళాకారుల సోలో, యుగళ బృందం ఒడిస్సీ ప్రదర్శనలు నృత్య కళాప్రియుల్ని అలరించాయి. ఈ ఉత్సవంలో పాల్గొన్న కళాకారులకు ప్రత్యేకంగా సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు ఉత్సవానికి ప్రముఖ రచయిత, ఆకాశవాణి మాజీ స్టేషన్ డైరెక్టర్ సంతాను రథ్, చేనేత, జౌళి–హస్తకళల శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఉత్కళిక మేనేజింగ్ డైరెక్టర్ మధుమితా రథ్, ప్రముఖ ఒడిస్సీ నృత్య కళాకారిణి రాజశ్రీ చింతక్, పారాదీప్ ఫాస్పేట్ లిమిటెడ్ కార్పొరేట్ వ్యవహారాల అధికారి సుధి రంజన్ మిశ్రా తదితర ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో శ్రీ డాన్సు అకాడమీ బృందం పరం బ్రహ్మ పూర్ణ బ్రహ్మ ఒడిస్సీ నృత్యం, ఒడిస్సీ నృత్యం గురు అలోకా కనుంగో సోలో ఒడిస్సీ నృత్యం, స్వప్న రాణి సిన్హా, అంకిత రథ్ కృష్ణాష్టకం యుగళ ఒడిస్సీ యుగళ నృత్యం, శ్రీ రాధా కళాకుంజ్ నృత్య బృందం పంచ పరమేశ్వర్ ఒడిస్సీ నృత్య ప్రదర్శనతో రెండు రోజుల శ్రీ నృత్యోత్సవానికి తెర పడింది.

క్లుప్తంగా

సిమిలిపాల్‌లో హిమపాతం



సిమిలిపాల్‌లో హిమపాత దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో సిమిలిపాల్ గజగజలాడుతోంది. ఆదివారం ఉదయం ఈ ప్రాంతం జాతీయ ఉద్యానవనంలో హిమపాతం ఛాయలు తారసపడ్డాయి. ఈ ఏడాదిలో అత్యంత చలి నమోదైంది. సిమిలిపాల్ జాతీయ ఉద్యానవనం పరిసరాల్లో అతి తక్కువగా 3 డిగ్రీల సెల్సియస్ రాత్రి పూట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో అతి తక్కువ చలిగా రికార్డు నెలకొలిపింది. రాత్రి పూట కనీస ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ నమోదైన ప్రాంతాల వాతావరణం వివరాలు.

ప్రాంతం	రాత్రి పూట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
జి. ఉదయగిరి	6.6
ఝార్సుగుడ	6.8
రౌర్కెలా	6.8
కొరాపుట్	7.6
కిరై	7.8
ఫుల్బాణి	8.5
దారింగిబాడి	8.5
చిపిలిమా	8.2
అంగుల్	9.0
కెంజొహర్	9.2
సుందరగడ్	9.4
భవానిపట్న	9.4

రాజరాజేశ్వరిదేవికి పౌర్ణమి పూజలు



అమ్మవారికి పుష్పాభిషేకం

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: మండలంలోని కొంచాలకూర్మయ్యపేటలో దేవీ ఆశ్రమంలో ఆదివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీదేవికి పుష్పాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహా మేరువులకు ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సూర్యనారాయణ (ఫైల్)

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేటకు చెందిన దన్నాన సూర్యనారాయణ(58) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోష్ట పంచాయతీ పైడిపేట సామిల్లులో పనిచేస్తున్న సూర్యనారాయణ ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై బయలుదేరి వస్తుండగా అదుపుతప్పి సర్వీస్ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. రణస్థలం సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అక్కడ మృతి చెందాడు. సూర్యనారాయణకు భార్య జయమ్మ, వివాహమైన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాకాసి అలలకు యువకుడు బలి



మృతదేహాన్ని వద్ద మెరైన్, మందస పోలీసులు

కాశీబుగ్గ : మందస మండలం రట్టి బీచ్‌లో ఆదివారం విషాదం నెలకొంది. హరిపురం గ్రామానికి చెందిన మహావీర్ సేన్ (30) అనే యువకుడు సముద్ర స్నానానికి దిగి రాకాసి అలల తాకిడి బలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ రాష్ట్రం జోద్పూర్ జిల్లా బుల్లాడా మండలం బాల గ్రామానికి చెందిన మహావీర్ సేన్ బతుకు తెరువు కోసం మందస మండలం హరిపురానికి వలసవచ్చాడు. పాత జాతీయ రహదారి పక్కన జిలాబీలు, పకోడి వ్యాపారం చేసుకుంటూ సోదరి కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సరదాగా సముద్ర స్నానానికి వెళ్లి కొట్టుకుపోతుండగా స్థానికులు మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిసేపటి తర్వాత మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో మందస ఏఎస్ఐ కంచు శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, కలెక్టర్ బిజయ కుమార్ దాస్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి తదితరులు



పెద్దపులి, వేటాడే గిరిజనుల నృత్యం



తైక్వాండో విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా రహాగిరి ఉత్సవాలు

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలోని రాజవీధిలో ఆదివారం 'రహాగిరి' ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. రాజావారి ప్యాలస్ నుంచి హైస్కూల్ జంక్షన్ వరకూ రోడ్లన్నీ శుభ్రం చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 18 నుంచి గజపతి ఉత్సవాలు ప్రారంభం కానున్న దృష్ట్యా పలువురు కళాకారులను ప్రజలకు పరిచయం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన రహాగిరి ఉత్సవాలను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ప్రారంభించగా.. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణాధికారి గుణనిధి నాయక్, గుసాని బ్లాక్ బీడీవో గౌరచంద్ర పట్నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతలను అలరించాయి. ఈ కార్యక్రమాలను జిల్లా సాంస్కృతిక శాఖ అధికారిణి అర్చనా మంగరాజ్ పర్యవేక్షించారు.



చిన్నారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శన



అలరించిన రంగవల్లులు



దుస్తులు, పిండివంటల స్టాల్స్



అమ్మవారి జాతర ఘటాలు



గిరిజన సంప్రదాయ నృత్యం



ఖండాయత్ సమరయోధుల విన్యాసం



గజపతి తైక్వాండో విద్యార్థుల విన్యాసాలు

ఘనంగా మాల్యవంత్ ఉత్సవాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి మాల్యవంత్ ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. ఉత్సవాలు చూసేందుకు దాదాపు 2 లక్షలకుపైగా జనం వస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.



పూరి మల్కమ్ నృత్యం



పంజాబీ నృత్యం



గురుకుల పాఠశాల విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ దంపతులు



గిరిజన నృత్యం



వేదికపై మాట్లాడుతూన్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్



సంబల్‌పూరి నృత్యంలో విద్యార్థులు

సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలి

రాయగడ: నేటి యువత సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురష్కార గ్రహీత తరుణ్ కాంతి మిశ్రా పిలుపునిచ్చారు. స్థానిక యూజీఎంఐటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం జరిగిన రాయగడ కవితా మహోత్సవం-24 సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువత సాహిత్యం వైపు అడుగులు వేయాలన్నారు. ఎందరో మహా కవులు అందించిన సాహిత్యం రానున్న తరాలకు మార్గదర్శకం కావాలన్నారు. విమర్శలను పొగడ్తలుగా, తిరస్కారాలను సన్మానాలుగా గ్రహించిన నాడే వారు ఆయా రంగాల్లో మరిన్ని ఉన్నత స్థానాలు అధిగమిస్తారన్నారు. కవితా మహిత్సవం అధ్యక్షుడు డాక్టర్ డి.కె.మహంతి అధ్యక్షతన జరిగిన సభ నిర్వహించారు. మహంతి మాట్లాడుతూ యువ కవులను ప్రోత్సాహించేలా ఇటువంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించాలన్నారు. ప్రముఖ అనువాద కవి బంగాళి నందా, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘ మిత్రాదేవి, లావణ్య సబర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ధ్యుతి చంద్ర సాహు, పలువురు సాహితీ వేత్తలు పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను కార్యదర్శి సుశాంత్ నాయక్ వివరించారు . కార్యక్రమంలో సాహితీ ప్రియులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సంస్థ వార్షిక సంచికను ఆవిష్కరించారు.



వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు



కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ అభిమానులు

పాఠశాల విద్యాభ్యాసం భవిష్యత్‌కు దిక్సూచి



వార్షికోత్సవానికి హాజరైన పూర్వ విద్యార్థులు

భువనేశ్వర్: ప్రతి వ్యక్తి ఉజ్వల భవిష్యత్‌కు పాఠశాల విద్యాభ్యాసం దిక్సూచిగా నిలుస్తుందని ప్రముఖులు ప్రబోధించారు. ఖుర్దారోడ్ రైల్వే పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం 'రోజా' 17వ వార్షికోత్సవం పురస్కరించుకుని పలువురు విద్యావేత్తలు ప్రసంగించారు. స్థానిక రైల్వే పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం ఆదివారం జరిగింది. రైల్వే పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టరు ప్రసన్న కుమార్ మహంతి అధ్యక్షత వహించిన రోజా వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా కేంద్ర విద్యా శాఖ మాజీ కార్యదర్శి అరుణ్ కుమార్ రథ్, ప్రధాన వక్తగా విద్యావేత్త హరేకృష్ణ మహాపాత్రో, నీతీ ఆయోగ్ సభ్యుడు, రాష్ట్ర సమాచార కమిషను మాజీ చీఫ్ కమిషనర్ జగదానంద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ఉన్నత ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సృజనాత్మక రచనలతో అమ్మొ స్కూలు (మన బడి) వార్షిక సంచిక ఆవిష్కరించారు.



రోజా వార్షికోత్సవ వేదికపై అతిథి ప్రముఖులు

చైతీ ఉత్సవాలకు ముహూర్తపు రాట



ముహూర్తపు రాటలో పాల్గొన్న అధికారులు

రాయగడ: స్థానిక గొవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న చైతీ ఉత్సవాలకు సంబంధించి శనివారం సాయంత్రం ముహూర్తపు రాట కార్యక్రమం జరిగింది. జిల్లా సాంస్కృతిక విభాగం అధికారి సుచిత్ర బౌరి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రదాన్, వాటర్ షెడ్ పిడి డాక్టర్ దయానిధి బాగ్ తదితరులు హాజరయ్యారు. ఉత్సవాలు నిరాటంకంగా కొనసాగేలా పూజలు నిర్వహించారు. ఈ సారి ఉత్సవాల ప్రారంభోత్సవాని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో పాటు ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పొరిడ, మంత్రులు నిత్యానంద గొండ, సురేష్ పూజారి తదితరులు హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లను ఉత్సవ కమిటీ నిర్వహిస్తుంది. ఈ ఏడాది చైతీ ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడుతుండటం విశేషం.

బిల్లుల్లేని జీడి పప్పు వాహనం సీజ్

- రూ.2.34 లక్షలు జరిమానా

జయపురం: బిల్లులు లేకుండా జీడి పప్పు లోడు తీసుకువెళ్తున్న ట్రక్కును జి.ఎస్.టి అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. జి.ఎస్.టి, ఎన్ఫోర్సుమెంట్ అధికారులు ఆదివారం సాయంత్రం జయపురం సమితి రొండాపల్లి ప్రాంతంలో జీడిపప్పు డబ్బాలు రవాణా చేస్తున్న ఒక టక్కును అడ్డగించి తనిఖీ చేపట్టారు. జయపురం నుంచి నాగపూర్ జీడి పప్పు రవాణా చేస్తున్న ట్రక్కులో 742 జీడి పప్పు డబ్బాలు ఉండగా.. 288 డబ్బాలకు మాత్రం బిల్లు చేసి ఉండటం అధాకారులు గుర్తించారు. ఎక్కువ సరుకు పంపుతూ తక్కువ సరుకుకు బిల్లు చేసి, జి.ఎస్.టి పన్ను చెల్లించలేదని అధికారులు తెలిపారు. ట్రక్కులో 454 డబ్బాలకు బిల్లు లేకపోవడంతో జీడి పప్పు ధరలో 10 శాతం (రూ.2,34,492) జరిమానా విధించారు. కలియ ట్రాన్స్ పోర్టర్స్ నుంచి ట్రక్కులో ఐదుగురు జీడి పప్పు యజమానులు జయపురం నుంచి నాగపూర్ పంపుతున్నట్లు తెలిసింది.

స్లో సైకిల్ రేస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ పాత్రో

రాయగడ: చైతీ క్రీడోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గొవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో స్లో సైకిల్ రేస్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా అదనపు ఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో సి.హెచ్.అపర్ణ ప్రథమ, పూర్ణిమ సబర్ ద్వితీయ, ప్రీతీమయి ప్రధాన్ తృతీయ బహుమతులను సంపాదించుకున్నారు. ప్రోత్సాహక బహుమతులను రూపాలి రాగ్, పి.కళ్యాణి సంపాదించుకున్నారు.



విజేతలతో నిర్వాహకులు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. తొలిరోజు జరిగిన రెండు మ్యాచ్‌లలో రాయగడ, మల్కనగిరి కళాశాలలు విజయం సాధించాయి. విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో మొదటసారి నిర్వహిస్తున్న ఇంటర్ కళాశాల టీమ్‌ల పోటీలలో మొదటి ఆటలో నవరంగపూర్ కళాశాల, రాయగడ ఆదర్శ స్నాతక కళాశాల తలపడ్డాయి. టాస్ గెలిచిన నవరంగపూర్ ఫీల్డింగ్ ఎంచుకుంది. రాయగడ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 4 వికెట్లకు 191 పరుగులు చేసింది. 192 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నవరంగపూర్ 20 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌట్ అయింది. రాయగడ టీమ్‌లో అరుణ్ 58, ఉమాకాంత ఉపాధ్యాయ 51 పరుగులు చేశారు. నవరంగపూర్ టీమ్‌లో ఉమాకాంత పట్నాయక్ అత్యధికంగా 46 పరుగులు చేశారు. రెండో మ్యాచ్‌లో కొట్‌పాడ్, మల్కనగిరి కళాశాలల టీమ్‌లు తలపడ్డాయి. టాస్ గెలిచిన మల్కనగిరి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన కొట్‌పాడ్ కళాశాల 16.4 ఓవర్లలో 75 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మల్కనగిరి టీమ్ 76 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించి సునాయాసంగా విజయం సాధించింది. మల్కనగిరి టీమ్ 9.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 76 పురుగులు చేసి గెలిపొందింది. ఈ పోటీలను టోర్నమెంట్ విభాగ ఆర్గనైజింగ్ కార్యదర్శి సచిన్ కుమార్ నాయక్, పీఈటీ భగవత్ ప్రాద్ సింగ్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు.



పోటీల నిర్వహణలో సచిన్‌కుమార్ నాయక్, తదితరులు



మొదటిరోజు విజేతలు రాయగడ, మల్కనగిరి జట్లు

రేఖానా వీధిలో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో అయ్యప్పస్వాములు

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలోని రేఖాన వీధిలో కన్నెస్వాముల పడిపూజను శనివారం రాత్రి శాసనపురి సతీష్, ప్రవీణ్ స్వాముల ఆధ్వర్యంలో గురుస్వామి పాటిమెట్టి మన్మథరావు ఆచారి, క్రిష్ణ, రమణ గురుస్వాముల పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. పడిపూజకు చుట్టుపక్కల అయ్యప్పస్వాముల సన్నిధానాలతోపాటు కాక జామి, పద్మపురం గ్రామాల నుంచి స్వాములు హాజరై భజనలు చేశారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం


అదుపుతప్పిన టాటామ్యాజిక్ వాహనం

సీతంపేట: మండలంలోని ఆడలి వ్యూపాయింట్ పర్యాటక ప్రదేశానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో పర్యాటకులు వస్తుండగా టాటా మ్యాజిక్ వాహనం సవర గొయిది ఘాట్ రోడ్‌లోని మలుపు వద్ద అదుపు తప్పింది. మలుపు వద్ద ఘాట్ రోడ్ దిగుతుండగా వాహనం బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి పక్కనున్న గుట్టను ఢీకొట్టి వ్యాన్ ఆగిపోయింది. దీంతో అదృష్టవశాత్తు వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా క్షేమంగా బయటపడ్డారు. పెద్దప్రమాదం త్రుటిలో తప్పడంతో పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీకాకుళం నుంచి ఆడలి వ్యూపాయింట్‌తో పాటు పలు పర్యాటక ప్రదేశాలు చూడడానికి సుమారు 12 మంది టాటా మ్యాజిక్ వాహనంపై సీతంపేట మండలానికి వచ్చారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర. (వెనుక ముసుగులో నిందితుడు)

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని ఈశ్వర నారాయణకాలనీ రెండో లైన్‌లో ఈ నెల 13న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజాం రూరల్ హెచ్.ఉపేంద్ర విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈశ్వరనారాయణకాలనీలో నివాసం ఉంటున్న అమర సత్యనారాయణకు మాధవ బజార్‌లో కిరాణా దుకాణం ఉంది. అందులో పట్టణ పరిధి కొండకవీధికి చెందిన చిప్పాడ అరుణ్‌కుమార్ ఏడాది క్రితం పనిలో కుదిరాడు. ఇంటి విషయాలన్నీ తెలుసుకున్న నిందితుడు ఈ నెల 13న సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి వద్ద ఎవరూ ఉండరని తెలుసుకుని ఇంటికి వెళ్లి తలుపులు పగలగొట్టి దొంగతనానికి పాల్పడి 12.5 తులాల బంగారం చోరీ చేశాడు. క్లూస్ టీం సేకరించిన ఆధారాల మేరకు దర్యాప్తు చేపట్టిన ఎస్సై వై.రవికిరణ్ కేసు ఛేదించారు. ఆదివారం ఉదయం సారథి రోడ్డులో బంగారాన్ని విక్రయించేందుకు తిరుగుతున్న నిందితుడు అరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేసి చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ ఉపేంద్ర తెలియజేశారు.

ముగ్గురిపై అట్రాసిటి కేసు నమోదు

బొండపల్లి: కులం పేరుతో దూషించిన ముగ్గురు వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి మండలంలోని రోళ్లవాక గ్రామాస్తురాలు ఎస్సీ కులానికి చెందిన మైసర్ల పోలమ్మ తన భర్త సింహాచలం ప్రభుత్వం ఇచ్చిన ఇంటిస్థలంలో గ్రామంలో పూరిపాక వేసుకుని నివసిస్తున్నారు. ఈనెల 4న ఉదయం తాళ్లపూడి పేట గ్రామానికి చెందిన తాళ్లపూడి ప్రకాశ్, రమణ, గురినాయుడులు అక్రమంగా దౌర్జన్యం చేసి పొక్లెయినర్‌తో తమ పూరిపాక సమీపంలో గల మరుగు దొడ్డిని తొలగించడంతో పాటు తమను కులం పేరుతో దూషించి దుర్భాషలాడినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏకగ్రీవమైన 202 సాగునీటి సంఘాలు

పార్వతీపురం: సాగునీటి సంఘాల ఎన్నికలు స్వల్ప ఘర్షణల నడుమ శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 213 సాగునీటి సంఘాలకు గాను 202 నీటి సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని 1490 ప్రాదేశికాలకు గాను 202 నీటి సంఘాల సభ్యులను ఎన్నుకున్నారు. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో 70 ప్రాదేశిక సంఘాల్లో 11 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని కూటమి నేతలు ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో ఎక్కడా ఎన్నిక జరగలేదంటే ఏ స్థాయిలో ప్రలోభాలు, దౌర్జన్యాలకు దిగారో తేటతెల్లమవుతోందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని పలువురు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సాలూరు: పట్టణ శివారులో రాయ్‌పూర్ హైవే దుగ్గసాగరం రోడ్డు సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, సుమారు 45 సంవత్సరాలు వయస్సుగల పురుషుడి మృతదేహాన్ని గుర్తించామన్నారు. కుడిచేతి అరచేయి లేకుండా ఉందన్నారు.దీనిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

- నేటి నుంచి వచ్చేనెల 13వరకు పుణ్యమాసం
- భోగి, సంక్రాంతి, కనుమల సమాహారం
- సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలం

ఆధ్యాత్మికం.. ధనుర్మాసం


వెంగాపురం రామాలయం


బలిజిపేట వేంకటేశ్వరస్వామి

బలిజిపేట: పల్లెలు, పట్టణాలలో దేవాలయాల ద్వారా ఆధ్యాత్మిక వెలుగులు ధనుర్మాసంలో విరజిమ్ముతాయి. ఆలయాలలో నిత్య కైంకర్య సేవలు, విశేష రోజులు, సేవలు, శ్రీ గోదా రంగనాథ స్వామివార్ల కల్యాణం, ప్రత్యేక పాశురాలు, పులకింపజేసే తిరుప్పావై ప్రవచనాలు, పూజా కార్యక్రమాలు, భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలతో ధనుర్మాసం శ్రీమహా విష్ణువుకు అత్యంత్ర ప్రీతికరమైనదిగా ప్రాచుర్యం చెందింది. వేదాల్లో సామవేదం, మాసాల్లో మార్గశిరం అత్యంత పవిత్రమైనవిగా గుర్తింపు పొందాయి. ఈ మాసంలో రంగనాథుడిని పరమభక్తితో సేవించడం ద్వారా గోదాదేవి ఆయనను వరించి, తన భక్తిని చాటుకుంది. సూర్యుడు వృశ్చికరాశి నుంచి ధనుస్సు రాశిలోకి ఈనెలలోనే ప్రవేశిస్తాడు. విష్ణువును ప్రసన్నం చేసుకోవడానికి గోదాదేవి రోజుకో రీతిలో తిరుప్పావై పాశురాలను ఆలపించడం విశేషం. ధనుర్మాసం పండగ నెల ప్రారంభమవుతుందనగానే పట్టణ, పల్లె ప్రాంతాలు పరవశిస్తాయి. నెల మొదలైన నాటినుంచి సంక్రాంతి సంబరాలు మొదలవుతాయి. హరిదాసు కీర్తనలతో పల్లెలు పులకిస్తాయి.

శ్రీవైష్ణవులకు తిరుప్పావై వ్రతం ముఖ్యమైనది. ఈ వ్రతం సందర్భంగా నెలరోజులపాటు రోజుకో పాశురం చొప్పున విన్నపం చేస్తారు. ఒకటి నుంచి 5రోజులు నియమనిబంధనలకు సంబంధించిన పాశురాలు. 6వ రోజునుంచి 15 రోజు వరకు పాశురాలతో తన తోటి చెలికత్తెలను నిద్రలేపి నందగోపుని గృహానికి వెళ్లడం, 16,17,18 రోజుల్లో పాశురాలతో నందగోపుడు, యశోద, బలరాములను మేల్కొలపడం, 23వ పాశురంలో మంగళాశాసనం, 25, 26పాశురాలలో స్వామికి అలంకారాలైన ఆయుధాలలో పరా అనే వాయిద్యాన్ని తమ శరణాగతిని అనుగ్రహించి, తమ సంకల్పాన్ని నెరవేర్చమని ప్రార్థిస్తారు. ఆఖరి రోజున గోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారని అర్చకులు చెబుతున్నారు. గోదాదేవితో కూడుకుని ఉండే నారాయణ అర్చన సేవయే ఈమాసం ప్రాధాన్యంగా పేరొందిందని, భగవంతుడిని ఏవిధంగా చేరుకోవాలో తెలిచజేసే మాసమని అర్చకులు వివరిస్తున్నారు. భక్తులు ఈ మాసంలో స్వామివారి సేవలలో పాల్గొని చూసి, విని తరించాలని కోరుకుంటున్నామని అర్చకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గొబ్బెమ్మ కొలువులు

పండగ నెల ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఇంటిముందు కళ్లాపు చల్లి అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి గోదాదేవి, లక్ష్మీదేవి, గౌరీమాతగా భావిస్తూ గోవుపేడతో పేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గుల మధ్యలో ఉంచుతారు.

భోగిభాగ్యాలు
గ్రామాలు, పట్టణాల్లో భోగి మంటలను వేస్తారు. దీంతో సకల దోషాలకు పరిహారం లభిస్తుందని భావిస్తారు.

సంక్రాంతి.. పితృదేవతలకు శాంతి
మకర సంక్రాంతిని పెద్దల పండుగ అని అంటారు. ఈ రోజున పితృదేవతలకు కొత్త బట్టలు పెట్టుకుని తర్పణాలు వదులుతారు. పంచభక్ష్య పరమాన్నాలతో నైవేద్యం సమర్పించి పెద్దల ఆశీర్వచనం పొందుతారు.

కనుమతో ధనుర్మాసం పూర్తి
కనుమ పండగతో ధనుర్మాసం ముగుస్తుంది. దీన్నే పశువుల పండగ అంటారు. ఏడాదిపొడవునా వ్యవసాయ పనుల్లో సాయం చేసిన పశువులకు రైతులు ప్రత్యేకంగా పూజలు చేస్తారు.

శ్రీమహావిష్ణువుకు ప్రీతిపాత్రం
ధనుర్మాసం శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. వేకువనే స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, తిరుప్పావై నిర్వహిస్తారు.

ధనుర్మాసంలో విశిష్టమైన రోజులు

2025, జనవరి 3వ తేదీన కుత్తు విళక్కెరియ (19వ పాశురం), సహస్ర దీపాలంకరణ సేవ
- 8వ తేదీన 24వ పాశురం-పొన్నాకుల హారతి
- జనవరి, 10వ తేదీన ముక్కోటి ఏకాదశి, ఉత్తరద్వార దర్శనం
- జనవరి, 11వ తేదీన కూడార్పై వెల్లుం- 27వ పాశురం
- జనవరి, 13వ తేదీన భోగి, శ్రీగోదా రంగనాథ స్వామివార్ల కల్యాణం వైష్ణవాలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు

భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడి ఆవరణలో అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని వేదపండితులు ఘనంగా, శాస్త్రోక్తంగా ఆదివారం చండీయాగం నిర్వహించారు. అనంతరం అమ్మవారి యాగ ప్రక్రియ విశిష్టతను భక్తులకు వివరించారు. అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి, నేతేటి ప్రశాంత్ పాల్గొనగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించి తరించారు.

సమష్టి కృషితో శాంతిభద్రతల పరిరక్షణ

- ఎస్పీ వకుల్ జిందాల్, కమాండెంట్ మల్లికా గార్గ్


పోలీసుల పరేడ్ విన్యాసాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, కమాండెంట్ మల్లికా గార్గ్

డెంకాడ: సమష్టితత్వంతో శాంతిభద్రతల పరిరక్షణకు పని చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్, 5వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ అన్నారు. ఈ మేరకు చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ 36వ వార్షిక స్పోర్ట్స్,గేమ్స్ మీట్-2024 ముగిపు కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, కమాండెంట్ మలికా గార్గ్‌లు అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలతో పోలీసుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభ బహిర్గతమవుతుందని అన్నారు. పోటీల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. టగ్ ఆఫ్ వార్, 100 మీటర్ల పరుగు, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, లాంగ్ జంప్ వంటి వివిధ క్రీడా పోటీలను పోలీసులు, మినిస్టీరియల్ అధికారులు, పోలీస్ కుటుంబాలు, క్లాస్-4 ఉద్యోగులకు వేరువేరుగా నిర్వహించారు.

విజేతలు: స్పోర్ట్స్‌మీట్‌లో బి కంపెనీకి చెందిన సురేష్ వ్యక్తిగత చాంపియన్ షిప్, బి కంపెనీ జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు
ముగింపు వేడుకల్లో వివిధ పోలీస్ జట్లు నిర్వహించిన మార్చ్ పాస్ట్, ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బైక్‌లతో నిర్వహించిన సాహస విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్‌లు బాపూజీరావు, రమణమూర్తి, శ్రీనివాస్, గోపాలకృష్ణ, ఆర్‌ఐలు జి.రవీంద్ర, ఎం.శ్రీనివాసరావు, దానయ్య, నూకరాజు, దామోదర్, కేకే ఏఎం రాజు, కేశవరావు, చంద్రమోహన్, ఎ.శ్రీనివాసరావు, సుధాకర్‌బాబు, చంద్రశేఖర్, సమర్పణరావు, ఎన్.గణేష్,ఎట శోభారాణి, ఆర్‌ఐలు, పోలీస్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌరినాయుడికి సాహితీ సత్కారం


సాహితీ సత్కారం అందుకున్న గౌరినాయుడు

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త డాక్టర్ కిలారి గౌరినాయుడికి గీతాజయంతి సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం సాహితీ సత్కారం లభించింది. శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక సాంస్కృతిక కళాపీఠం, ఉమర్ అలీషా రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కవి పండిత సభలో గౌరినాయుడు సాహిత్య, సంగీత, సాంస్కృతిక, కళ, పరిశోధన రంగంలో చేస్తున్న కృషిని గుర్తించి ఘనంగా సత్కరించారు. సాహిత్య సాంస్కృతిక కళారంగాల్లో ఉద్దండ పండితులు జన్మించిన గడ్డపై తనకు సన్మానం జరగడం ఆనందకరంగా ఉందని గౌరినాయుడు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గౌరినాయుడుకి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బొండపల్లి: భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బొండపల్లి మండలంలోని కొత్తపాలెం గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొట్నూరు అప్పారావు(42) తన భార్యతో శనివారం రాత్రి గొడవ పడగా ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోగా మనస్తాపానికి గురై ఆదివారం వేకువ జామున తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేయగా శవాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బొబ్బిలిలో మరొకరు..
బొబ్బిలి: మండలంలోని మెట్టవలసకు చెందిన పెదప్రోలుజగదీశ్వరరావు(45) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై జి భాస్కరరావు తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగదీశ్వరరావు గ్రోత్ సెంటర్‌లోని హీరా కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన జగదీశ్వర రావు శనివారం విధులకు వెళ్తున్నట్లు భార్యాపిల్లలకు చెప్పి మార్గమధ్యంలో పురుగు మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• అ‘పూర్వ’ సమ్మేళనం



పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక స్థానిక రాంబిల్లి నాగరాజు తోటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో సందడిగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. చివరిగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సెలెన్స్ అవార్డులు అందుకున్న ఎంవీఎస్ శాస్త్రిని సత్కరించారు. – పొందూరు

వరి నూర్పుడు యంత్రం దగ్ధం

మెంటాడ: మండలంలోని ఆగురు పంచాయతీ పరిధి సారాడ వలస గ్రామంలోని పోలాల్లో వరి నూర్పుడు యంత్రంలో చెలరేగిన మంటల కారణంగా యంత్రం దగ్ధమైంది. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన సార రమణ వరి పొలంలో పంటను యంత్రంతో నూర్పుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వరి యంత్రంతో పాటు ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో మూడు ఎకరాల్లోని వరి పంట కూడా అగ్నికి ఆహుతైంది. దీంతో మూడున్నర లక్షల వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఎన్నికలుండవు


మాట్లాడుతున్న మాజా డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికలేవీ ఉండవని తాజాగా నీటి సంఘాల ఎన్నికల ద్వారా మరోసారి రుజువైందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు రైతులకు ఇవ్వాల్సిన సెస్ రశీదులను వీఆర్‌ఒలు, తహసీల్దార్‌లు ఇవ్వలేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగవని ముందుగానే తెలిసి నీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించినట్లు గుర్తు చేశారు. అయినప్పటికీ నియోజకవర్గంలోని ఒకటి రెండు ప్రాంతాల్లో తమ వ్యక్తిగత కారణాల దృష్ట్యా వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఎన్నికల్లో నిలబడి గెలిచారన్నారు. మక్కువ మండలంలో టీడీపీ కూటమి సానుభూతిపరులు ఈ ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదని తెలిసి, రైతులకు సెస్‌లు ఇవ్వకుండా తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది తప్పించుకున్నారని, టీడీపీ నేత ఒత్తిడితోనే ఇలా చేశారని ఆరోపించారు. ఈ నీటి సంఘాల ఎన్నికలు 95 శాతం కూటమి కైవసమని పచ్చమీడియాలో ప్రచురించడం ఎందుకని 100 శాతం కై వసమని ప్రచారం చేసుకోవాల్సిందన ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో దారుణాలు
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగంలో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు,అత్యాచారాలు రాష్ట్రంలో పెరిగిపోయాయని వాపోయారు. ఎన్నికల ముందు జగన్‌పై కూటమి నేతలు తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల్లో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. జమిలి ఎన్నికలు 2027లో వచ్చే అవకాశం ఉందని అందరూ భావిస్తుండగా 2029లో వస్తాయని చంద్రబాబు చెబుతున్నారని, కేంద్ర పెద్దలు నిర్ణయించినప్పుడే జమిలి ఎన్నికలు జరుగుతాయే కానీ చంద్రబాబు చెప్పినప్పుడు కాదని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరి రఘు,మద్దిల గోవింద,తాడ్డి యశోద కృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

100మంది ప్రభుత్వ పింఛన్‌దారులకు సత్కారం


పింఛనర్ల దినోత్సవ కార్యక్రమం వివరాలను విడుదల చేసిన సంఘం సభ్యులు

- 17న అఖిల భారత పింఛన్‌దార్ల దినోత్సవం

విజయనగరం అర్బన్: అఖిల భారత పింఛన్‌దారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన స్థానిక పింఛను దారుల భవనంలో పలువురు సీనియర్ పింఛన్‌దారులను ఘనంగా సత్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, జి.నారాయణ తెలిపారు. ఈ మేరరకు ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పింఛనదారుల దినోత్సవ షెడ్యూల్‌ను విడుదల చేశారు. సంఘంలో 75 సంవత్సరాలు దాటిన సీనియర్ పింఛనర్లను 100 మంది వరకు గుర్తించామని వారు ప్రభుత్వానికి అందించిన సర్వీసులను గౌరవిస్తూ సన్మానం చేస్తామని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి జిల్లా ఖజానా, అకౌంట్స్ ఆఫీసర్ ఆర్ ఏఎస్‌కుమార్, ఉపఖజానా అధికారులు ఐ.రమేష్, ఎం.ఆదినారాయణ, ఏపీఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీరమణ, జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ ఎస్‌కిశోర్ హాజరవుతారని తెలిపారు. సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్


వెంకటాద్రి ఆస్పత్రిలో గైనిక్, పిడియాట్రిక్, జనరల్ సర్జరీ విభాగాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్


డాక్టర్ శ్రావణి ప్లాస్టిక్, కాస్మెటిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక రింగ్ రోడ్డులోని పువ్వాడ స్కూల్ వద్ద గల వెంకటాద్రి ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసి పిడియాట్రిక్, గైనిక్, జనరల్ సర్జరీ విభాగాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో కొత్తగా వచ్చిన ఆధునాతన పద్ధతులను వినియోగించి వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ దేవి రమ్యప్రియ, డాక్టర్ రాఘుదీప్తి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్, కాస్మోటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ప్రారంభం
అలాగే విజయనగరంలోని గుమ్చీ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ శ్రావణి ప్లాస్టిక్ అండ్ కాస్మోటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రావణి ముద్దాడ తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ తనిఖీ

నెల్లిమర్ల: పట్టణంలోని శ్రీ సాయి సుభద్ర సినిమా థియేటర్‌ను తహసీల్దార్ సుదర్శనరావు ఆదివారం తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో విక్రయిస్తున్న పదార్థాలను పరిశీలించి, తాజా పదార్థాలు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మొద్దని సూచించారు. అలాగే మరుగుదొడ్లను పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని స్పష్టం చేశారు. ప్రేక్షకుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వాసవి క్లబ్‌కు అవార్డుల పంట


బెస్ట్ రీజియన్ సెక్రటరీ అవార్డు అందుకుంటున్న సముద్రాల నాగరాజు

విజయనగరం: వాసవి క్లబ్ విజయనగరానికి అవార్డులు వరించాయి. మధురైలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ ఐకాన్ సమావేశంలో విజయనగరం వాసవి క్లబ్‌కు ఆరు బెస్ట్ అవార్డులు లభించాయి. సమాజసేవ, ప్రకృతి పరిరక్షణలో భాగంగా ప్రతిభ చూపించిన వారికి అవార్డులు లభించాయని ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ పేర్ల మహేష్ తెలిపారు. బెస్ట్ వైస్ గవర్నర్‌గా ఆలవెల్లి శేఖర్, బెస్ట్ డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీగా గుంపిన నారాయణరావు, బెస్ట్ రీజియన్ చైర్మన్ చిట్టూరి మురళీకృష్ణ, బెస్ట్ రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు, బెస్ట్ ప్రెసిడెంట్ చెక్కా జనార్దనరావు, బెస్ట్ సెక్రటరీ కట్టమూరి రత్నారావు ఎంపికైనట్లు తెలిపారు. మధురైలో జరిగిన ఐకాన్ సమావేశంలో అందరికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్, 2025 అధ్యక్షుడు ఎరుకుల రామకృష్ణ, పూర్వ అధ్యక్షుడు ఏవీఎస్ గుప్తా, ఎన్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి అవార్డు సాధించిన సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్నలక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ స్థానిక కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001 – 02 సంవత్సరంలో జీఓ 217 ద్వారా జీఓ 459తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హెల్త్ అసిస్టెంట్లను నియమించారని తెలిపారు. ఇప్పుడు ఇలా కోర్టు తీర్పు పేరిట ప్రభుత్వం వీరిని తొలగించడం అన్యాయమన్నారు. ఈ తొలగింపుతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సమావేశంలో జీవీ ప్రసాద్, వర్మ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.